అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మారుతినగర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. వెంకటాపురం డివిజన్‌లో అంతర్గత రోడ్లు, తాగునీటి వసతి, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీ వాసులు అరుణ్‌కుమార్, శంకర్, సాయి, అనిల్‌కుమార్, సంపత్, నాయకులు టీవీ.భాస్కర్, మల్లెల శివ, మోసిన్, సంతోష్, జనార్దన్, ఉదయ పాల్గొన్నారు.

మౌలాలి: మల్కాజిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఎజెండాగా తీసుకొని రాజకీయాలకు తావు లేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మౌలాలి డివిజన్ పరిధిలో రూ.1.36 కోట్ల వ్యయంతో ఈస్ట్ మారుతీనగర్, శ్రామికనగర్‌లో సీసీ రోడ్డు పనులు, క్రియేటివ్ నగర్‌లో ఆర్‌సీసీ పైపులైన్, సుధానగర్‌లో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, ఈఈ లక్ష్మణ్, డీఈ మహేష్, ఏఈ మధురిమ, నాయకులు అమీనుద్దీన్, గుండా నిరంజన్, భాగ్యనంద్‌రావు, సత్తయ్య, భాస్కర్, ఇబ్రహీం, చందు, సంతోష్ రాందాస్, దినేష్, షకీల్, శైలేందర్, సంతోష్‌గుప్తా, జాన్‌బీ, శ్రీనివాస్, శివాజీ, పాండురంగాచారి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


మారుతినగర్‌లో రోడ్డు మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా..

మౌలాలి: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్) ద్వితీయ మహాసభ, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) 10వ ప్లీనరీ పోస్టర్‌ను శుక్రవారం మౌలాలిలోని మారుతీనగర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆవిష్కరించారు. జర్నలిస్ట్ నాయకులు అమరేందర్, విల్సన్, వెంకటనాయుడు, సంగమేశ్వర్, రాజుగౌడ్, పాండుగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాప్రా: సంక్రాంతి పండగ పురస్కరించుకొని బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ కాప్రా చెరువు వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే వారు కాలనీ పేరు, ఫోన్ నంబర్ తెలిపి మధ్యాహ్నం 12 గంటల లోపే నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు ఫోన్: 97038 01819.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌లో నిర్మిస్తున్న యూజీడీ పనులను శుక్రవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నాచారం డివిజన్ కమిటీ


మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: త్వరలోనే కాంగ్రెస్ నాచారం డివిజన్ కమిటీని వేయనున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు వీఎస్ ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరమేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉప్పల్ యూత్ అధ్యక్షుడు అరుణ్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజు, నర్సింగ్‌రావు, భిక్షపతి, సునీల్ రెడ్డి, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న గీత

మల్లాపూర్: మున్నూరు కాపు సంఘం ఉప్పల్ నియోజకవర్గ మహిళా కార్యదర్శిగా సాదినేని గీతా పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండదేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేందర్ పటేల్ నియామకపు ఉత్తర్వులను గీతకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో మున్నూరు కాపు సంఘం బలోపేతం, సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రతిష్టాత్మక అవార్డుకు ఎన్‌జీఆర్ శాస్త్రవేత్త డా.రవికుమార్



ఉప్పల్: సీఎస్ఐఆర్ జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ ముఖ్య శాస్త్రవేత్త డా.ఎం.రవికుమార్ ప్రతిష్టాత్మక ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎంపికైనట్లు ఈ సంస్థ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఘన, భూవిజ్ఞాన శాస్త్ర రంగంలో ఆయన చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కిందన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


అంబేడ్కర్ జైభీమ్ జెండా పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

మల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద నల్లబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జైభీమ్ జెండాను ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారికి సమన్యాయం, అణిచివేత లేకుండా స్వేచ్ఛ కల్పించేలా రాజ్యాంగంలో దిశానిర్దేశం చేసిన అంబేడ్కర్ అశయ సాధనకు అందరూ ఏకమవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జెరిపోతుల ప్రభుదాస్, సీనియర్ బీఆర్ఎస్ నేత సాయిజెనోఖర్, అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.మల్లేష్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పర్నాటి వెంకట ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

మల్లాపూర్: యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మర్రిగూడలో రాజిరెడ్డి సివిల్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంతంగా వ్యాపారులు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, నిర్వాహకులు అల్లూరి రాజిరెడ్డి, రాజు, బీఆర్ఎస్ నేతలు సాయి జెనోఖర్, మహేందర్‌రెడ్డి, గడ్డం రవి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సామాజిక వేత్త రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

పాఠశాలల అభివృద్ధికి కృషిచేద్దాం

బోడుప్పల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ 28వ డివిజన్‌లోని హరిజన వాడలో ఉన్న మండల ప్రజాపరిషత్ పాఠశాలకు శుక్రవారం మారోజు నిరంజనాచారి దంపతులు, ఆనంద్ దంపతులు రూ.3 లక్షలు విలువ చేసే 40 బెంచీలు, 2 టేబుల్స్, 110 మంది విద్యార్థులకు షూలు, బెల్టులు, సాక్సులు, వరలక్ష్మి అనే మహిళ వంట సామాగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా మేయర్ బుచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని ఆయన సూచించారు. డిజిటల్ క్లాస్‌ల ఏర్పాటుకు మేయర్ బుచ్చిరెడ్డి రూ.లక్ష, వరలక్ష్మి రూ.80 వేలు, పాఠశాల భవనానికి రంగు వేయించేందుకు 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ ముందుకు వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్లు చీరాల నర్సింహ, దానగల్ల అనిత, నోడల్ అధికారి పాపిరెడ్డి, మీసాల కృష్ణ, పోలోజు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

రమణమ్మకు అండగా ఉంటా

మల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన బాధితురాలు రమణమ్మకు అండగా ఉంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. నాచారం అంబేడ్కర్‌నగర్‌లో శుక్రవారం ఆమె పరామర్శించారు. అనంతరం దళిత బంధు రూ.పది లక్షల సహాయాన్ని అందిస్తామని, దరఖాస్తు ఫారం అందజేశారు. అలాగే బాధిత మహిళకు కృత్రిమ కాళ్లు అందించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత సాయిజెనోఖర్, ముత్యంరెడ్డి, అంజి, కొత్త రామారావు తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి దళిత బంధు దరఖాస్తు ఫారం అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఏడాదైనా.. పనులేవి..?

అధికారులపై కార్పొరేటర్ ఆగ్రహం

మల్లాపూర్: పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెనోఖర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డు కార్యాలయంలో డివిజన్ అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్షించారు. నాలా వంతెనలు, అంబేడ్కర్ యువజన సంఘం భవనం, హనుమాన్‌నగర్ సామాజిక భవన నిర్మాణాల పనులపై నిర్లక్ష్యం వహించడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై సమీక్షలో కార్పొరేటర్ శాంతి సాయిజెనోఖర్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

అల్వాల్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, ప్రజాగాయకుడు గద్దర్, కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. వెంకటాపురం డివిజన్‌లోని మహాబోధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన, సోషల్ ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మేదస్సుకు పదును పెట్టేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెన్నెల, ప్రిన్సిపల్, రాము, ప్రధానోపాధ్యాయురాలు భవాని, లలిత, నాయకులు సీఎల్.యాదగిరి, సైంటిస్ట్ చిన్న రాజు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, ప్రజాగాయకుడు గద్దర్

ఉప్పల్ మాలబస్తీలో కార్పొరేటర్ పర్యటన


ఉప్పల్ మాలబస్తీలో కార్పొరేటర్ రజిత

ఉప్పల్: ఉప్పల్ మాలబస్తీలో శుక్రవారం అధికారులు, స్థానికులతో కలిసి కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పర్యటించారు. గడప గడపనూ కదిలించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. రూ.17.5 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. త్వరలోనే మాలబస్తీలో రూ.32 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, నవీన్, శీలం నవీన్, ప్రశాంత్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి సువర్ణ పుష్పాభిషేకం



అల్వాల్: కానాజీగూడలోని మరకత లక్ష్మీ గణపతి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి సువర్ణ పుష్పాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రీ మాట్లాడుతూ విరామం లేకుండా చిలుకలగూడ చౌరస్తాలో, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఎవరైనా భక్తులు అన్నప్రసాద వితరణలో విరాళాలు అందజేయాలంటే ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆడపిల్లలను ఆటల్లో ప్రోత్సహించాలి

రామంతాపూర్: కరాటే, కుంగ్‌ఫూ, బాక్సింగ్ వంటి క్రీడల్లో పురుషులతో సమానంగా ఆడపిల్లలను కూడా కుటుంబసభ్యులు ప్రోత్సహించాలని హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ల కార్పొరేటర్లు కక్కిరేని చేతనహరీష్, బండారు శ్రీవాణివెంకట్రావు అన్నారు. రామంతాపూర్ శ్రీనివాసపురంలోని కవిత తైక్వాండో అకాడమీ వార్షికోత్సవ వేడుకలకు శుక్రవారం వారు హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కరాటే బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలామంది యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి క్రీడల్లో చిచ్చరపిడుగులా తయారు చేస్తున్న అకాడమీ డైరెక్టర్ కరాటే బ్లాక్ బెల్ట్ కవితను వారు అభినందించారు. కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో పాటు అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.


కరాటేలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో కార్పొరేటర్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం సీఐ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. చెంగిచర్ల మేడిపల్లికి చెందిన సత్యనారాయణ కుమారుడు రాజేష్(30) గచ్చిబౌలిలోని నానక్‌రాంగూడలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 6.45 గంటలకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా మల్లాపూర్ సూర్యనగర్ మెయిన్‌రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

బోడుప్పల్: 3వ డివిజన్ పరిధిలోని కృష్ణనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సైదులు, కోశాధికారి బాలాజీ, సలహాదారులు లింగయ్య, వేణుగోపాల్, సభ్యులు మురళి మోహన్, శ్రీనివాస్, రాజు, శ్యాంసుందర్ తదితరులున్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్

బకాయిలు చెల్లించని ఇంటి గేటుకు తాళం


ఇంటి గేట్‌కు తాళం వేస్తున్న ఆర్ఐ వెంకటేశ్వర్లు

బోడుప్పల్: పన్ను బకాయిలు చెల్లించని ఓ ఇంటి గేటుకు శుక్రవారం కమిషనర్ పద్మజారాణి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పద్మజారాణి మాట్లాడుతూ ఎస్‌ఐఎస్ కాలనీలో ఇంటి నంబరు 3-125/26/ఎ యజమాని ఇంటి పన్ను బకాయిలు రూ.67,856 ఉన్నారని తెలిపారు. ఇంటి పన్ను చెల్లించాలని డిసెంబర్‌లో రెడ్ నోటీసు జారీ చేశామని, అప్పటికీ చెల్లించకపోవడంతో డ్రైనేజీ కనెక్షన్ తొలగించారు. సదరు ఇంటి యజమాని మున్సిపల్ కార్యాలయంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించిన డ్రైనేజీ కనెక్షన్‌ను పునరుద్ధరించుకున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు సదరు ఇంటి యజమానికి ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు ఇంటి యజమాని గేట్‌కు తాళం వేసి సీజ్ చేసినట్లు తెలిపారు.

సైనిక్‌పురిలో మన్నార చోప్రా సందడి



సాక్షి, సిటీబ్యూరో: అందం శారీరక సౌందర్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని ప్రముఖ దక్షిణాది నటి మన్నార చోప్రా తెలిపారు. సైనిక్‌పురి వేదికగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ గ్రోహైర్ క్లినిక్‌ను శుక్రవారం మన్నార చోప్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మారుతున్న అలవాట్లు, జీవనశైలితో జుట్టు రాలడం సమస్య ప్రతి ఒక్కరిలో పెరిగిపోయిందన్నారు. ఇలాంటి వారికి అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడం అభినందనీయం అన్నారు. అడ్వాన్స్‌డ్ గ్రోహైర్ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వేల్, ఫ్రాంచైజీ భాగస్వాములు శ్రీధర్ పురుషోత్తమ్, హరిణ్య గౌని పాల్గొన్నారు.

కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలి


హబ్సిగూడలో దున్నపోతుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, వైజెఎస్, తెలుగు యువత, ఏఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హబ్సిగూడ చౌరస్తాలో నిర్వహించిన వినూత్న నిరసనలో దున్నపోతుకు వినతి ప్రతాన్ని అందజేశారు. 1600/800 పరుగు పందెంలో ఉత్తీర్ణత సాధించిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష అవకాశం కల్పించాలని, ప్రిలిమ్స్ ప్రాథమిక మల్టీపుల్ పరీక్షలో తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు మార్కులు కలపాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన చలో హైదరాబాద్ నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, సత్యప్రసాద్, సలీం పాషా, రెహమాన్, ఉదయ్, సతీష్‌కుమార్, ఆశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు షురూ..

- నిన్న ఒక్కరోజే రూ.3.25 లక్షలు వసూలు
- ఈ నెల 31లోపు పూర్తి చేయాలని టార్గెట్

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్‌లో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు స్పెషల్ డ్రైవ్ షురూ చేశారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ ఆదేశాల మేరకు ఎస్ఎఫ్ఏలు, జవాన్లు రంగంలోకి దిగారు. సర్కిల్‌లోని ఆరు డివిజన్లలో వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు నుంచి ఫీజులు వసూలు చేయడం ప్రారంభించారు. కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట-హెచ్‌బీకాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్లలో ట్రేడ్ లైసెన్సు వసూలు ఎస్ఎఫ్ఏలు, జవాన్లకు అప్పగించారు. ఇందుకు మొత్తం 28 మంది ఎస్ఎఫ్‌లు, 11 మంది జవాన్లు విధులు నిర్వహిస్తూ వారి వద్ద ఉన్న జాబితా ఆధారంగా రెగ్యులర్ ప్రాపర్టీస్, ఎస్ఆర్ ప్రాపర్టీస్ నిర్వాహకుల వద్దకు ట్రేడ్ లైసెన్సులను పరిశీలించి, లేనివారిని గుర్తించి ఫీజు వసూలు చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో 6 వేలకు పైగా ఎస్ఆర్ ప్రాపర్టీస్, 2,500 వరకు రెగ్యులర్ ప్రాపర్టీస్ ఉన్నాయి. ఇందులో ఎస్ఆర్ ప్రాపర్టీ కలిగిన 2 వేల మంది వ్యాపారులు మాత్రమే ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉన్నారు. మిగతా 4 వేల వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఎస్ఎఫ్ఏలు, జవాన్లు వీరిపై ప్రధానంగా దృష్టి పెట్టి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్నారు. శుక్రవారం ఒక్కరోజు సుమారు 100 మంది వ్యాపారస్తుల నుంచి దాదాపు రూ.3.25 లక్షలు ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఏలు, జవాన్లకు అప్పగించిన ట్రేడ్ లైసెన్స్ వసూలు లిస్ట్ టార్గెస్‌ను ఈ నెల 31లోపు పూర్తి చేయనున్నారు.


కాప్రా సర్కిల్‌లో వ్యాపారస్తుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ముగిసిన పాలిటెక్నిక్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు

రామంతాపూర్: రామంతాపూర్‌లోని జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. వాలీబాల్‌లో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఖోఖోలో సికింద్రాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కబడ్డీలో దత్త ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్, బ్యాడ్మింటన్‌లో మహవీర్ పాలిటెక్నిక్ కళాశాల, డబుల్స్‌లో మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన జట్లకు రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వినయ్‌కుమార్ బహుమతులను అందజేశారు.


ఖోఖో క్రీడల్లో విజయం సాధించిన బాలికల జట్టు